# కొసరు

చెల్లూరి సీతారాజేశ్వరరావు




శివజోగి టేబిల్ మీది ఫైల్స్ చూసి కంగారు పడిపోడు. వాటి సంఖ్య పెరిగితే అతడికి ఆనందం. అవతలి వారికి ఆత్రుత. ఒక వేళ ఆఫీసరు పిలిచి అడిగినా ఫైలులోని విషయాల మీద లక్ష సందేహాలు వెలిబుచ్చుతాడు. తెలివిగా జీవోలు వాడుకుంటాడు. ఆఫీసర్లు యాగనోము పడతారు. శివజోగి చేతిలో ఏదైనా పడితే (భారతీయ కరెన్సీ మాత్రమే) ఫైలు నడుస్తుంది. కాదు పరుగెడుతుంది.

ఆ రోజు అయిదువందలు చేతిలో పడినాయి. అయిదు గంటలకి, యింకా యిరవై నిముషాలుంది. శివజోగికి ఆఫీసులో కూర్చో బుద్ధి కాలేదు. పర్మిషను తీసుకుని యింటికి నడిచాడు. దారిలో మామిడి పళ్లు కనపడినాయి. గీచిగీచి డజను బేరమాడి పుచ్చుకున్నాడు.

"కాయలంత బాగోలేదు. ఈ చిన్న కాయ వెయ్యి," శివజోగి మరో కాయతీసుకుని సంచిలో పడేసుకున్నాడు.

"అసలే నష్టం బాబూ. కొసరు ప్రాణం తీస్తుంది. ఆ బాధ మీకు తెలియదు బాబూ!" పళ్లు అమ్మే తాత బాధ పడ్డాడు.

శివజోగి నవ్వుకుంటూ సైకిల్ ఎక్కాడు. అతడికి చాల ఆనందంగావుంది. ఈ అయిదు వందలు కూడ వడ్డీకి యిచ్చేస్తే మొత్తం పదకొండు వేలవుతుంది. శివజోగి గుట్టు మనిషి. తన సీటు ప్రతిభ యింట్లో చెప్పడు. సంపాదన ఎక్కువయిందని తెలిస్తే ఖర్చు పెరిగిపోతుంది. తను నిర్వాకస్థుడు కావాలి.

పైగా విధవ అప్పగారు, ఆమె కొడుకు భవాని తన మీద ఆధారపడి వున్నారు. సంసారానికి ఖర్చు పెట్టేయడం అతడికిష్టముండదు.

శివజోగి యింటికి రాగానే ముఖం కడుక్కుని లుంగీ చుట్టుకుని కూర్చున్నాడు. నాగమణి టీ యిచ్చింది. భార్య చెబుతున్న కబుర్లు వింటూ కూర్చున్నాడు పెరటి అరుగు మీద. హఠాత్తుగా అతడికి గుర్తు వచ్చింది, జేబులోని అయిదువందలు బీరువాలో పెట్టలేదని.

గదిలోకి వచ్చాడు. ఫ్యాంటులో పర్సులేదు. గుండె జిల్ మంది. అటుయిటు వెతికాడు. లేదు. ఇంటి దాకా జేబులో వుంది. అంతలో ఎక్కడ పడింది?

"ఏమిటండీ వెతుకుతున్నారు? " నాగమణి అడిగింది.

"పర్స్ పడిపోయింది."

"ఎంత వుంది?" ఆందోళనగా అడిగింది దగ్గరకి వచ్చి.

నిజం చెబితే వీల్లేదు. నెలాఖరి రోజులు " యాభై " అన్నాడు.

కాస్సేపటికి అప్పగారు భవానితో వచ్చింది "ఇదిగోరా తమ్ముడూ నీ పర్స్. సైకిల్ పెట్టే వరండాలో పడిపోతే, భవానికి దొరికింది. చూసుకో డబ్బు వుందో లేదో! "

నాగమణి పర్సు తీసి చూసింది. తొమ్మిది అయిదులు, అయిదు ఒకట్లు. "సరిగ్గానే వుందండీ. మనసొమ్ము గట్టిది. యాభయ్యీ వుంది. మనవాడికి దొరికింది కనుక సరిపోయింది. "

శివజోగి ముఖం బొగ్గులావుంది. అందులో అయిదు వందలు వుండాలి. యాభై వుండటమేమిటి? పడేసుకుంటే పూర్తిగా పోవాలి కదా! ఇప్పుడు నిజం చెప్పినా లాభం లేదు. నమ్మరు.

## అ భే ద ం

పచ్చదనం పరికింపు పక్షికి
ఏ చెట్టుపైనా దూషణలేదు
సర్వమత సారం తెలిసిన వానికి
ఏ మతం పైనా కినుక లేదు.

— బద్వేలి రమేష్

















## కొసరు

"ఇంకా అలా ముఖం వ్రేలాడేసుకుంటావేంరా? డబ్బు దగ్గర జాగ్రత్తగా వుండాలి!" అప్పగారు వెళ్ళిపోయింది.

శివజోగి మడత మంచం మీద నిస్తేజంగా పడుకున్నాడు. అంతా అశాంతిగావుంది. బంతి ఆడుకుంటున్న భవాని దగ్గర కెళ్ళి "అందులో యింకా వుండాలిరా డబ్బు? ఏం చేసావు చెప్పు?" గద్దించాడు.

"నాకు తెలియదు మామయ్యా!"

"నిజం చెప్పు!" చెవి పట్టుకున్నాడు.

వాడు పెద్ద రాగం తీశాడు. అప్పగారు, భార్య వచ్చేశారు. "అందులో యింకా డబ్బు వుండాలిటే అమ్మా! నేను తీశానంటున్నాడు మామయ్య!"

"ఇంకా వుంటే యాభై అనే ఎందుకు చెబుతావు? డబ్బు చేదా? నీ మీద పడివుంటున్నామని దొంగల్ని చెయ్యకు? అయినా అంత డబ్బు ఎక్కడిది నీకు?"

అప్పగారి నోరు పెద్దది. సమాధానం చెప్పలేక వెర్రిగా నవ్వి "వుత్తదే... సరదా కన్నాను. నవ్వుతూ కోప్పడితే ఏడ్చేస్తున్నాడు" అన్నాడు.

'భవానికో రూపాయి యివ్వండి. పర్స్ బంగారు తండ్రిలా తెచ్చాడు.' అన్నది నాగమణి.

శివజోగి ఏడుస్తూ యిచ్చాడు. 'కొసరు' బాధ అప్పుడు తెల్సింది అతడికి.